# మ్యాచ్ ఫిక్సింగ్

- పి.వి.రమణకుమార్



"నల్లనివాడు పద్మ నయనమ్ములవాడు టీ.వీలోంచి వినిపిస్తున్న దూరదర్శన్ కార్యక్రమంలోని హరికథా కాలక్షేపాన్ని భరించలేక లేచి వెళ్ళి ఛానెల్ మార్చేశాడు దుర్గబాబు.

"నల్లవాడే..... అమ్మమ్మ అల్లరిపిల్ల వాడే.....!"

ఈసారి వినిపించిన పాట ఒళ్ళంతా కంపరాన్ని కలిగించింది. ఈసారి పూర్తిగా టీ.వీకే ఫుల్‌స్టాప్ పెట్టేసి డైలీ న్యూస్ పేపర్‌ని అందుకున్నాడు. ఆ రోజు స్కోరు బోర్డు చూసాడు.

పంజాబులో పదిహేను
ఆంధ్రాలో ఆరుగురు
మహారాష్ట్రలో ముగ్గురు
బెంగాల్‌లో ఇద్దరు
బీహార్‌లో తొంభైమంది
ఒరిస్సాలో ఒక్కరు.
కాశ్మీర్‌లో నలభై రెండు

వెరసి దేశవ్యాప్త చావులు మొత్తం నూట అరవై ఒక్కటి.

'అరె ఈ రోజు స్కోరు కాస్త తగ్గిందే!' అనుకోకుండా వుండ లేకపోయాడు. పేపర్ బ్యాక్ పేజీ తిప్పాడు.

"నల్లదనానికి విరుగుడు."

ఓ అడ్వర్‌టైజ్‌మెంట్ ఆకర్షించింది. గభాల్న ముఖం దగ్గరకు చేర్చుకుని ఆత్రంగా చదివాడు.

"నల్లగా ఉన్నారని బాధపడుతున్నారా?

అయితే మా "జిగట శోభిని"ని వెంటనే వాడండి. ప్రఖ్యాత సిద్ధ పురుషులు శ్రీ జిగటానంద మహర్షిగారిచే తయారు చేయబడినది. సీసా ఖరీదు 333.00 రూ॥.

తారుకన్నా నల్లగా ఉండే దుర్గబాబు ఫేసు పెట్రోమాక్స్ లైటులా వెలిగిపోయింది.

"అమ్మా!"

అంటూ అరిచాడు. వంట గదిలో టిఫిన్ తయారీలో తల మునకలై వున్న సావిత్రమ్మ 'ఏం కొంపలంటుకున్నాయో!' అనుకుంటూ పరుగున వచ్చింది.

"నాకు టైమ్ అవుతోంది స్నానానికి నీళ్ళు

పెట్టు" చెప్పాడు.

"ఇదిగో పెడుతున్నారా నాయనా!"

నీరసంగా విసుక్కుంటూ సమాధానమిచ్చి వెళ్ళిపోయింది. అప్పుడే మార్కెట్ నుంచి కూరగాయల బుట్టతో ఎంటర్ అయ్యాడు దుర్గబాబు తండ్రి సుందరబాబు.

"నాన్నా.... ఆ గుంటూరు సంబంధం వాళ్ళు ఎప్పుడు రమ్మనమని కబురు చేసారు?"

చాలా మామూలుగా ఓ ఫ్రెండుని అడిగినట్లు అడిగాడు. "పదహారో తారీఖు"

బిక్కు, బిక్కు మంటూ సమాధానం చెప్పి లోపలికి వెళ్ళిపోయాడు సుందరబాబు.

దుర్గబాబుని 'నల్లగా వున్నావని' ఎవరైనా అతని ముందు అంటే మాత్రం వాళ్ళను హత్య చేసినంత పని చేస్తాడు. పాతిక లక్షల ఆస్థికి ఒక్కడే వారసుడు. కంప్యూటర్ కాలేజీలో లెక్చరర్. మనిషి హైటు కేవలం ఐదడుగులు. వెయిటు మాత్రం ఎనభై ఆరు కేజీలు. వయసు ముప్ఫైరెండు. రంగు మాత్రం..... నలుపు.... పిల్లలు దడుసుకునేంతటి కారు నలుపు.

నలుపుకి విరుగుడు మందు "జిగట శోభిని" ప్రకటను చూసిన ఆనందంలో హుషారుగా ఈల వేసుకుంటూ బాతురూమ్‌లోనికి దూరిపోయాడు.

"ఈ గుంటూరు సంబంధం అయినా కుదురుతుందంటావా సావిత్రీ?"

వంటగదిలో భార్యతో అన్నాడు సుందరబాబు.

"ఆ కృష్ణ పరమాత్మదయ."

"ఆయన దయ వల్లనే వీడింత నల్లగా పుట్టాడు." చిర్రుబుర్రు లాడాడు సుందరంబాబు.

నల్లగా నిగనిగలాడే ముఖాన్ని సబ్బుతో అరగదీసి, కరగదీసి, తుడిచి పౌడర్ అద్ది, షర్టు టక్ చేసి ముక్క పైకి వాలినట్లు కళ్ళజోడు తగిలించుకుని పాయింట్ షూస్‌తో గంభీరంగా కాలేజీకి బయలుదేరాడు దుర్గబాబు.

కాలేజీ క్యాంపస్‌లోకి అడుగు పెడుతుండగా "హల్లో దుర్గా...." అంటూ కేక వేసి పిలిచాడు జితేంద్రబాబు. జితేంద్రబాబు ఎర్రగా దబ్బపండులా వుంటాడు. దుర్గబాబుతో బాటే అదే కాలేజీలో వర్క్ చేస్తున్నాడు. పేరుకి ఫ్రెండే అయినా జితేంద్ర బాబంటే చెప్పలేనంత జెలసి.

"ఏమిటీ సంగతీ చాలా ట్రిమ్‌గా తయారయ్యావ్?"

"అంటే తయారైన ప్రతిసారీ ఏదో ఒక సంగతి ఉండాలా?" ఉక్రోషంగా ఎదురు ప్రశ్నించాడు దుర్గబాబు.

"ఎందుకు దుర్గా అంత సీరియస్ ఐపోతావ్. మళ్ళీ మ్యాచ్ ఏదైనా వచ్చిందేమోనని నీ డియరెస్ట్ ఫ్రెండుగా అడుగుతున్నాను." చెప్పాడు జితేంద్రబాబు.

ఇద్దరూ కలసి స్టాఫ్ రూమ్ వరకూ నడిచారు.

'కుళ్ళుబోతు వెధవా! ఏ సందు దొరుకుతుందాని ఏక్కిరించడానిక్కదూ అడుగుతోంది. తనలో తనే అనుకున్నాడు.' నీ ముఖానికి ఎంత మేకప్ పులిమినా దెయ్యప్పిల్లలా వుంటావు తప్పనిచ్చి ఓ అందమా! పాడా!" తనలో తాను అనుకున్నాడు జితేంద్రబాబు.

ముఖాలపైకి ఇకిలింపులు పులుముకుంటూ స్టాఫ్ రూములోకి చొరబడ్డారు.

సుమారు పదకొండు గంటలు కావస్తుండగా అటెండర్ తిరుపతయ్య ఓ కార్డు ముక్కను తీసుకు వచ్చి అందించి, ముసి, ముసిగా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

"చిరంజీవి దుర్గబాబుకి ఆశీర్వచనాలతో.

గుంటూరు సంబంధం వారు ఫలానా తేదీన నిన్ను చూసుకునేందుకు అమ్మాయిని వెంట బెట్టుకుని తీసుకువస్తున్నాను.


ముఖ్య విషయం. అమ్మాయి నాంచారి కూడా వస్తున్నది కావున. ముందుగా మధ్యవర్తినైన నేను నీకు ప్రత్యేకంగా తెలియజేస్తున్నాను.

ఇట్లు

విధేయుడు


మ్యారేజి లింక్స్ లింగబాబు.

ఆ కార్డు చదవడం పూర్తి చేసిన దుర్గబాబుకి చెమటలు పట్టాయి. కార్డు చేతికందిస్తూ అటెండర్ తిరుపతయ్య ఎందుకంత చెండాలపు నవ్వు నవ్వాడో! అప్పుడర్థమైంది. 'అయినా అమ్మాయి పెళ్ళి చూపులకి రావడం ఏమిటి ఖర్మ. ఈ లింగబాబు ఇటువంటి లింక్ పెడతాడనుకోలేదు.



### తప్పులు

సెక్సీ హీరో సల్మాన్‌ఖాన్ తన తప్పులను తెలుసుకుని పశ్చాత్తాప పడుతున్నాడు. హీరోయిన్ల ప్రేమవల్లో పడి జీవితంలో చాలా నష్టపోయాను అంటున్నాడు. ఇలాంటి స్టేట్ మెంట్లు ఇవ్వడం సల్లూకి మామూలే కదా! *(కుక్క తోక వంకర అన్నట్లు సల్మాన్‌లో అంత త్వరగా మార్పు వస్తుందా?)*



ఆ పాయింట్రం దాకా ఎలాగో క్లాసులో వెళ్ళదీసి, కాలేజీలో ఎవరితోనూ మాట్లాడకుండా సరాసరి ఇంటికి వచ్చేస్తూ దారిలో రెంటెడ్ బుక్ స్టాల్ దగ్గర ఆగి క్రొత్తగా వచ్చిన నవలలు చూసాడు.

"లవ్వంటే కొవ్వు." "ఇది ఎన్నో ముద్దు" "సిగ్గు లేదు" "నల్ల పిల్ల" వీటిల్లో "నల్లపిల్ల" నవలనే సెలెక్టు చేసుకుని ఇంటికి వచ్చేసి, స్నానం పూర్తి చేశాక తల్లితో గుంటూరు వారి మ్యాచ్ విషయం చెప్పాడు.

"అయ్యో, అయ్యో! అదేవిట్రా విడ్డూరం. అమ్మాయి వచ్చి అబ్బాయిని పెళ్ళి చూపులు చూట్టం ఏంటి నా శ్రాద్ధం." దీర్ఘం తీసింది సావిత్రమ్మ.

"నా పిండాకూడు కదూ! ఇది ఈనాటి వెరయిటీ పెళ్ళి చూపులంట...." ఇంట్లోకి వస్తూనే విసవిసలాడాడు తండ్రి సుందరబాబు.

"పోనీయ్‌లే. ఈ సంబంధం అయినా ఖాయం అయితే ఆ కృష్ణ పరమాత్మ భజన పెట్టిస్తా."

భక్తితో చేతులు జోడించి చెబుతున్న తల్లితో తండ్రేదో వాదులాడుతున్నాడు. విసుగనిపించి టీ.వీ ఆన్ చేసాడు దుర్గబాబు.

"నమస్కారం! ఈ రోజు వార్తల్లోని ముఖ్యాంశాలు. మొన్న ఉగాదికి జరిగిన కవి సమ్మేళనాలలో వంద మందికిపైగా మరణించారు. నాలుగు వందల మంది తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. ఈ సంఖ్య రేపటికి పెరగవచ్చునని భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్లుండి బంద్ పాటిస్తున్నారు. హోమ్ మంత్రి కవులు కనిపిస్తే కాల్చివేతకు ఆజ్ఞలు జారీ చేసారు..."

దుర్గబాబుకి ఆనందంతో తాండవం చేయాలనిపించింది. అందుక్కారణం తన ఎనిమీ జితేంద్రబాబు కూడా వర్ధమాన కవి. ఉగాదినాడు ముప్ఫై మూడు కవి సమ్మేళనాలలో పాల్గొన్నానని తెగ సంబరపడుతున్నాడు. ఈ దెబ్బతో ఔట్. వార్తల వరకే టీ.వీ చూసి తర్వాత ఆనందంగా స్నానం చేసి, భోజనం ముగించి తన కిష్టమైన నవల 'నల్లపిల్ల'ను చేతులోకి తీసుకుని చదవడంలో మునిగి పోయాడు.

* * *

"ఇలా కూర్చోండి!" నఖ శిఖ పర్యంతం, దుర్గబాబుని కాలు మీద కాలు వేసుకుని పరిశీలిస్తూ చెప్పింది లేడీ కానిస్టేబుల్ నాంచారి. కొద్దిగా సిగ్గనిపించినా సర్దుకుని ఆమెకు ఎదురుగా కూర్చున్నాడు దుర్గబాబు. ఈ పెళ్ళి చూపుల తంతుకు వచ్చిన చుట్టాలంతా బిక్క చచ్చి బిగుసుక్కూర్చున్నారు. ఎక్కడ మధ్యలో మాట్లాడితే మఫ్టీలో వున్న నాంచారి లాఠీచార్జీ చేస్తుందేమోనన్న భయంతో.

"మీ ఆకారం కాదు నాక్కావలసింది."

"మరి?" అడిగాడు.

"అభిరుచులు."

"అడగండి."

"మిమ్మల్ని ఎవరైనా రౌడీ ఆడపిల్లలు ఎప్పుడైనా టీజ్ చేసారా?"

"లేదండి... నేను ఇన్నోసెంట్‌ని."

"మీరెవరినైనా లవ్ చేశారా?"

"ఛీ.... పాడు నేను తండ్రి చాటుకొడుకుని." వినయంగా చెప్పాడు. అతని వినయం చూసి పెద్దలందరికీ చాలా ముచ్చటేసింది.

"మీరెప్పుడైనా కవిత్వం రాసారా?"

"హత్య చేసారా?" అన్నట్లు వినిపించింది.

"ఛీ.....ఛీ..... అలాంటి అరాచకప్పనులు మా ఇంటా వంటా లేవు." చాలా గర్వంగా చెప్పాడు.

"కవులంటే?"

"నా దృష్టిలో వాళ్ళంత క్రూరులు ఈ ప్రపంచంలోనే లేరు."

"ఓ. ఐ.సీ..... అలాగా!" అంటూ లేచి నిలబడి "అయితే ఇక నా అభిప్రాయం వినండి. మీరు ఆకారం వికారం లోనే కాదు. ఆలోచనల్లో కూడా అధమస్థాయిలో ఉన్నారని అర్థమైంది. నాకు కవులన్నా, కవిత్వమన్నా చచ్చేంత ఇష్టం. కవిత్వాన్ని ఆస్వాదించనివారు, కవులను గౌరవించని వారు నా దృష్టిలో మనుషులే కారు. గుడ్ బై......"

చెప్పేసి బయలుదేరింది నాంచారి. ఆమెను అనుసరించారు వచ్చినవాళ్ళు.

"ఛీ.... ఎలుగుబంటి వెధవా నీకీ జన్మలో పెళ్ళికాదు." అరిచాడు తండ్రి సుందరబాబు.

"ఆ కృష్ణ పరమాత్మకు అంతమంది భార్యలు. ఆయన దయ వల్ల పుట్టిన వీడికి ఒక్క పెళ్ళికూడా లేదు భగవాన్...." వాపోయింది సావిత్రమ్మ.

'అన్ని మ్యాచ్‌లూ ఫిక్స్ అవుతున్నాయి కానీ నా మ్యాచ్ ఎందుకని ఫిక్స్ కావడం లేదో అర్థం కావడం లేదు...' ఆలోచిస్తూ జుట్టు పీక్కున్నాడు దుర్గబాబు.

*

## ఆమె

ఆమె నా అర్ధాంగి
నాకోసమే ఆమె
నా పాదాల వద్దే ఆమె
ఆమెకో స్వంత ఊహ
స్వంత ఆలోచన
ఉండకూడదు
అనుకున్నావు కదూ!
నీ అహం
ఆమెలోని ఓర్పును చంపినపుడు
నీలోని ఇగోని ఆమె గుర్తించినపుడు
ఏమౌతుందో తెలుసుకోగలవా?
అరచేతిలో సూర్యోదయాన్ని
ఆపగలిగానన్న తృప్తి నీలో మిగుల్తుందా?
ఆమె అజేయమైన శక్తిగా
ఊరూరా కీర్తించినపుడు
ప్రపంచమంతా ఆమెను గుర్తించినా
నీలోని పురుషాహంకారం
ఆమెను కీర్తిస్తుందా!
నీ ప్రాణం... నీ ఊపిరి
నీలో సగం... అయినా ఒప్పుకోవు...
కానీ... ఆమె...
ఇప్పటికీ... అనుక్షణం... ఎప్పటికీ...
నీలో...సగమే
కాదు... ఆమె ఊపిరి...ప్రాణం... నువ్వే...

**- కె. మంజువాణి**



## రాణీ కొత్త ప్రియుడు

గోవిందా పర్మినెంట్ ప్రియురాలు రాణీ ముఖర్జీ ప్రియుణ్ణి మార్చడంలో యమా బిజీ అయిపోయింది. ఇంతకు ముందు కరణ్ జోహార్‌ను తన ప్రేమమైకంలో ముంచెత్తిన రాణీ ఇప్పుడు అతని అసిస్టెంట్ నిఖిల్ అద్వానీపై వలపు గాలాన్ని విసిరింది. వీరిద్దరి మధ్యా రొమేన్స్ చాలా ఘాటుగా జరుగుతోందని బాలీవుడ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. రాణీముఖర్జీ ఇలా చేస్తే గోవిందా పరిస్థితి ఏమిటన్నది అక్కడి ప్రముఖులకు అంతు పట్టకుండా ఉంది.